బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేస్తాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో భేటీ అయ్యారు. బ్యారేజీల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్ డీఎస్ఏ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే తాను స్వయంగా బ్యారేజీలను సందర్శనకు వస్తానని చెప్పారు. బ్యారేజీల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిపుణుల సంస్థలను ప్రభుత్వం నియమించింది. డిజైనింగ్, టెస్టింగ్ సంస్థలు రంగంలోకి దిగాయి. డిజైన్‌కు ముందు అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థ చేస్తుంది. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జీపీఆర్ (గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) స్కానింగ్, డ్రోన్ సర్వేలు, బోర్ హోల్స్, జియోటెక్నికల్, జియోఫిజికల్ పరీక్షలతో భూమి, అక్కడ నిర్మాణాల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోనున్నారు. వివిధ సంస్థల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధులు, డిజైనింగ్ సంస్థ ప్రతినిధులు, ఇతర టెక్నికల్ ఏజెన్సీలు సభ్యులుగా ఉన్నారు. పరీక్షలు సకాలంలో జరిగేలా చూడడం.. అవసరమైన డేటా సమయానికి అందించడం, అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవడం ఈ కమిటీ చూసుకుంటుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగేందుకు, కేంద్ర స్థాయి నిపుణుల పర్యవేక్షణ కూడా ఉండే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అవసరమైతే ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ఇందులో చేర్చే అవకాశముంది. ప్రస్తుతం బ్యారేజీల ఫౌండేషన్, కట్ ఆఫ్ వాల్ పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనా వేయనున్నారు. అన్ని రకాల పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత, ఇప్పుడున్న నిర్మాణ లోపాలు గుర్తించి.. పూర్తి సమాచారం విశ్లేషణల ఆధారంగా వాటికి అనుగుణంగా పునరుద్ధరణ పనులకు డిజైనింగ్ సంస్థ కొత్త డిజైన్లు సిద్ధం చేస్తారు. ఈ డిజైన్‌ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి పంపించి.. వాళ్ళు ఇచ్చే సూచనలు మార్గదర్శకాలకు అనుగుణంగా పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ దేశంలో ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతను నిరంతరం పర్యవేక్షించే బాధ్యత కలిగిన చట్టబద్ధమైన సంస్థ. రానున్న మూడు నాలుగు నెలల్లో (వర్షాకాలం ముందు) అన్ని పరీక్షలు పూర్తి చేసి, డిజైన్లు సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాకాలం తరవాత పునరుద్ధరణ పనుల ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. పునరుద్ధరణ పనులు పూర్తిగా శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం అమలు చేసి, భవిష్యత్తులో 50 నుంచి 100 ఏళ్ల పాటు బ్యారేజీలు సురక్షితంగా భద్రంగా ఉండేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

గత ప్రభుత్వ లోపాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేయడమే తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం ఎన్ డీఎస్ ఏ, సీడబ్లూసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఐఐటీ ముంబయిలోని నిపుణుల సహకారంతో అత్యధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తి చేసి, వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. పారదర్శకత కోసం ప్రత్యేక కో ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశాము. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

తెలంగాణ ప్రజలకు బిజెపి ఎంపీ తేజస్వి క్షమాపణ చెప్పాలి : శ్రావ్య సుధీర్ రెడ్డి

విశ్వంభర, సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర విభజనపై అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని యువజన కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మహోన్నతమైన తెలంగాణ ఉద్యమాన్ని, రాష్ట్ర ఏర్పాటును భారత్ పాకిస్తాన్ విభజనతో పోల్చడం మూర్ఖత్వమని ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహచర ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్న అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బిజెపి ఎంపీలు మౌనంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ అస్థిత్వం, హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. అటువంటి రాష్ట్ర విభజనను దేశ విభజనతో పోల్చడం బిజెపి పార్టీ కు సంస్కారానికి నిదర్శనమని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ ఆవిర్భావంతో పోల్చడం యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యడల బిజెపి ప్రజా ప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా, నియోజకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అందుల పాఠశాల వార్షికోత్సవం

విశ్వంభర, మలక్ పేట్ : ప్రభుత్వ ప్రాథమిక బాలుర అందుల పాఠశాల దారుల్ షిఫా లో యాన్యుల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అంద విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకొని చక్కగా చదువుకోవాలని విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని కోరారు అందుల పాఠశాలను ప్రారంభించి 75 సంవత్సరాలకు పైగా అయ్యిందని ప్రతి సంవత్సరము విద్యార్థులు ఇక్కడ ప్రాథమిక విద్యను పూర్తి చేసి హైస్కూల్లో చేరి చక్కగా చదువుకుంటున్నారని ప్రస్తుతం ఉన్న విద్యార్థులు కూడా చక్కగా చదువుకోవాలని ఉన్నత విద్య అభ్యసించాలని ఉద్యోగాలు సాధించాలని ఈ సందర్భంగా కోరారు . ఇ ఎం ఎ ఫౌండేషన్ సభ్యులైన మహేష్ ఈశ్వర్ విద్యార్థులకు ఐపాడ్లు అందించి వాటిని చక్కగా వినియోగించుకోవాలని కోరారు. ఈ ఐపాడ్ లు విద్యార్థులకు అనేక రకాలుగా ఉపయోగపడతాయని ఫౌండేషన్ సభ్యులు చెప్పారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంజాద్ ఖాన్ ,రవికాంత్, రవీందర్ రెడ్డి, జానయ్య, మలిహ తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్సీ నీ వెంటనే అమలు చేయాలి: టీజీఈ జేఏసీ

విశ్వంభర, ఎల్బీనగర్ : తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను, న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం టీజీఈ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు శుక్రవారం సరూర్‌నగర్ మండల తహసిల్దార్ పి. వేణుగోపాల్ కు వారి ప్రధాన డిమాండ్లతో జూన్ 2 వ తేది నాటికి పీఆర్సీ అమలు పరచాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలనీ, ప్రకటిత ఎంప్లాయిస్ హెల్త్ స్కీం తక్షణమే అమలులోకి తెస్తూ అందరికీ హెల్త్ కార్డ్స్ జారీ చేయాలనీ, సీపీఎస్ రద్దు చేసి ఒపీఎస్ విధానం పునరుద్ధరణ చేయాలనీ, 61 సంవత్సరాలు నిండిన విఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సాధారణ బదిలీలు చేపట్టాలని వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో జీ. డేవిడ్, గోవర్ధన్ యాదవ్, ఆర్ఐ జ్యోతి, జీవన్ జ్యోతి, వి. ఈశ్వర్, బి.ప్రభాకర్, ఎస్. ప్రవీణ్,టీ.ప్రవర్ధన్ రెడ్డి రషీద్, అఖిల, వైఎస్ కల్పన, సరళ, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు తేజస్వి సూర్య బహిరంగ క్షమాపణ చెప్పాలి

విశ్వంభర, హైదరాబాద్ : పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్, పాకిస్తాన్ విభజనతో పోల్చిన బిజెపి ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్బీనగర్లోని శ్రీకాంతాచారి విగ్రహం నుండి ఎల్బీనగర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తేజస్వి సూర్య కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని అవమానించిన

తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దశాబ్దాల పోరాటం వేలాదిమంది, యువత త్యాగాల ఫలితం గా రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం తెలంగాణ అమరుల త్యాగాలను అవమానిచడమేనని పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజలను అవమానించేలా తేజస్వి సూర్య మాట్లాడుతుంటే తెలంగాణ బీజేపీ ఎంపీ లు స్పందించకపోవడం దారుణం అన్నారు. తెలంగాణ పై బీజేపీ ద్వంద వైఖరికి ఇది నిదర్శనం అన్నారు.
తెలంగాణ రాష్ట్రం, తెలంగాణ అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిందన్నారు, అలాంటి తెలంగాణ ను కించపరిచే విధంగా ఎవరు మాట్లాడిన ఊరుకునే ప్రసక్తే లేదని కాచం సత్యనారాయణ హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ అధిష్టానం, తెలంగాణ బీజేపీ ఎంపీలు స్పందించి వెంటనే తేజస్వి సూర్య తో క్షమాపణ చెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యములోవేలాది మంది ఉద్యమకారులతో కలిసి తెలంగాణ బీజేపీ ఎంపీల ఇండ్ల ముట్టడి కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు రామ్ నరసింహ గౌడ్, బీరెల్లి వెంకట్ రెడ్డి,ఉప్పల శ్రవణ్ కుమార్, కొత్త రవి,కొండ శ్రీనివాస్, పిడికిలి రాజు,సల్వా చారి,శ్రీధర్,కృష్ణ గుప్తా,అరుణ్ గౌడ్,పద్మ కృష్ణ, డి. వెంకటేష్, మల్లేష్, శ్రవణ్ రెడ్డి, జగదీశ్,శ్రీరాములు, వెంకట్ రెడ్డి, బాలరాజు గౌడ్, అశోక్ చారి, పరమేశ్వర్, కొండల్, రామకృష్ణ రెడ్డి, ఎండీ జాహెద్, టీ. మోహన్,ఎన్ రమేష్, మల్లేష్,కొండయ్య, జగన్, పిల్లి వెంకటేష్, మల్లేష్ యాదవ్, హరిబాబు, యాదగిరి, పబ్బ శ్రీనివాస్ గౌడ్, పబ్బ శేఖర్ గౌడ్, రాములు, శివ కృష్ణ, శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకటేష్ కుమార్, జయ శ్రీనివాస్ గౌడ్, వీరస్వామి, బాలస్వామి, సోమ శ్రీరాములు, మల్లేష్, శ్యామ్ సుందర్ గౌడ్, కార్తీక్ చారి, ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజలంతా రాహుల్ గాంధీ కి మద్దతు ఇవ్వాలి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

విశ్వంభర, సంగారెడ్డి : బీజేపీ చేస్తున్న హిస్సా చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పార్లమెంట్లో పోరాడుతున్నారని, దేశ ప్రజలంతా ఈ విషయంలో అప్రమత్తమై ఆయనకు మద్దతుగా నిలబడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తూ నాలుగో సారి అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.మహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, కానీ ఇందులో లోపాలు ఉన్నాయి, సరిదిద్దాలని రాహుల్ గాంధీ పార్లమెంట్ లో పోరాడుతున్నారన్నారు. డీలిమిటేషన్ బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. అనంతరం డీలిమిటేషన్ బిల్లు ప్రతులను జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశప్రజల స్వేచ్ఛా, స్వాతంత్రాలను అంచెలంచెలుగా లాగేసుకునే ప్రయత్నం బిజెపి చేస్తోందని, దానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాడుతున్నారని అన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల హక్కులను అంచెలంచెలుగా కాల రాస్తుందని విమర్శించారు.
హిస్సా చోరీపై రాహుల్ గాంధీ పార్లమెంట్ లో పోరాడుతున్నారని రాహుల్ గాంధీకి మద్దతుగా ఇందిరా గాంధీ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన సంగారెడ్డి నుంచి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఓటు బ్యాంకుని కంట్రోల్ లో ఉంచుకునేందుకు నియోజకవర్గాల పునర్విభజనకి ప్లాన్ చేసిందని పేర్కొన్నారు. ఎవరికి ఓటు వేసినా బిజెపికి ఓటు పడేటట్లు ఈవీఎంలని డిజైన్ చేస్తున్నారని అన్నారు. నాలుగవ సారి అధికారంలోకి వచ్చేందుకు ఎలక్షన్ కమిషన్ ని తన గుప్పిట్లో పెట్టుకుంది విమర్శించారు. మహిళా బిల్లుని యుపిఎ హయాంలోనే సోనియాగాంధీ ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు.మహిళా బిల్లుని మొదట తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు.మహిళా బిల్లులో ఉన్న లోపాలను సరి చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు.ఆ లోపాలను సరి చేసిన తర్వాతే మహిళా బిల్లుని ప్రవేశ పెట్టాలన్నది కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ అని జగ్గారెడ్డి తెలిపారు.

యూడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : యూడిఐడి (ప్రత్యేక వైకల్యం గుర్తింపు కార్డు) లను సద్వినియోగం చేసుకోవాలి అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన యూడిఐడి కార్డుల ను సుధీర్ రెడ్డి గారి చేతుల మీదుగా పలువురు దివ్యాంగులకు పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం తో బాధపడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యుడిఐడి కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చైతన్యపూరి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శివప్రకాష్, గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల అధ్యక్షులు మందా బిక్షపతి యాదవ్, ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు పర్కాల భాగ్యలక్ష్మి, సిద్ధం నర్సింగ్, పద్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆకాంక్షలు నెరవేర్పుట కొరకు కొత్త పార్టీ

- కల్వకుంట కవిత నాయకత్వంలో ఈ నెల 25న ప్రకటన
- తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్

విశ్వంభర, హుజూర్ నగర్ : తెలంగాణ ప్రజలు ఊహించిన ప్రత్యేక రాష్ట్రం రాలేదని సంపూర్ణ సర్వోదయ తెలంగాణ ఏర్పాటు కోసం కవితక్క ప్రజల్లో కెళ్ళి పోరాడుతున్నదని తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలోని టౌన్ హాల్ నందు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అసమర్థ ప్రభుత్వాలపై ప్రజలు తిరుగుబాటు సమయంలో కొత్త పార్టీలు ఆవిర్భవించడం సహజమేనని, అమరుల ఆకాంక్షల నెరవేర్పు కొరకు కవితక్క నేతృత్వంలో నూతన పార్టీ ఆవిర్భవించబోతుందన్నారురాష్ట్రం లో ప్రధాన పార్టీలు అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పార్టీలు ప్రజల కు ఏంమేలు చేశాయని వ్యాఖ్యానించారు.. పదేళ్ల బిఆర్ఎస్ పాలన రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలకు రాష్ట్రం ఏర్పడిందన్న పేరే తప్ప ఒరిగిందేమీ లేదని దుయ్యబ్బారు. జాగృతి కవితక్క తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించిన సందర్భంలో ప్రజలు రాష్ట్రం ఏర్పడిందన్న సంతృప్తిగా లేరని గమనించి ప్రజా సమస్యలను పరిష్కార మార్గంలో తేచ్చేందుకు కొత్తగా పార్టీ ఏర్పాటు చేసి ప్రజల ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు.ప్రజల కనీస అవసరాలు తీర్చలేని ప్రభుత్వాలు అధికారంలో ఉండడానికి ఏమాత్రం తగదని ఆయన అన్నారు. ప్రజల బాగోగుల కంటే పార్టీల నాయకులు వారి పదవులు కాపాడుకోవడం ,ఆస్తులు సంపాదించుకోవడానికి ప్రాధాన్యతరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా నెలకొని ఉన్న సమస్యలను కాంగ్రెస్ గాని బిఆర్ఎస్ గాని పరిష్కార మార్గం చూపలేదు అన్నారు. అందుకే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతనంగా పార్టీ ఏర్పాటు చేసి ప్రజలను మమేకం చేసుకొని ఉద్యమాల దిశగా కవితక్క అడుగులు వేస్తుందని కవితక్క ఆశయాలకు ప్రజల మద్దతు వారి దీవెనలు ఉంటాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఈనెల 25న నూతన పార్టీ ఆవిర్భావ పోస్టర్ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు కేఎల్ఎన్ రావు మందడి సోమిరెడ్డి జిల్లా కార్యదర్శి గోపగోని, జిల్లా నాయకులు ధరావత్ లక్ష్మణ్ చంటి నరసింహారావు రాహుల్ నాగుల్ మీరా వేణు నకరికంటి చిరంజీవి ధారావత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా.. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉప రాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖి చేసిన ప్రిజన్స్ డీజీ డా. సౌమ్య మిశ్రా

విశ్వంభర, సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర కారాగార శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా సూర్యాపేట సబ్ జైలును సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె జైలు నిర్వహణలోని ముఖ్య అంశాలు అయిన ఆహార నాణ్యత, భద్రతా ఏర్పాట్లు, పరిశుభ్రత, ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు. ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సంక్షేమం గురించి తెలుసుకొని, జైలులో అందుతున్న సదుపాయాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఖైదీలకు సరైన సంరక్షణ, భద్రత సంక్షేమాన్ని కల్పించడం అత్యంత ముఖ్యమని, అలాగే వారి పునరావాసం మార్పు కోసం సమర్థవంతమైన సంస్కరణ చర్యలను అమలు చేయాలని డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు.ఈ తనిఖీలో హైదరాబాద్ రేంజ్ డి ఐ జి ప్రిజన్స్ , డి. శ్రీనివాస్ , ఆర్. శోభన్ బాబు, బి. సుధాకర్ పాల్గొన్నారు.

ఆగి పాయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ

విశ్వంభర, సరూర్ నగర్ : ఆర్ కె పురం డివిజన్ లో ఆగి పొయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి కమిషనర్ కు రాసిన లేఖను డివిజన్ నేతలతో కలిసి కమిషనర్ కు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంజూరు అయిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఆర్ కె పురం సమగ్రాభివృద్ధికి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కమిషనర్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన వారిలో డివిజన్ సీనియర్ నాయకులు రామాచారి, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి ,గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.